# ప్రజా దివాస్

TGTEL/25/A0827

తెలుగు దినపత్రిక



విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...



సంపుటి : 1 | సంచిక :121 | prajadivvs57@gmail. com | ఆదివారం 15, మార్చి 2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 4 | వెల : 3/-


# భయపడకండి

- యుద్ధం ఎఫెక్ట్‌పై భయాందోళనలు సృష్టిస్తున్న కాంగ్రెస్
- నన్ను దూషించడమే పనిగా పెట్టుకుంది
- అస్సాంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ





# గ్యాస్ కొరత లేదు

## కమర్షియల్ సిలిండర్లలో కొంత లోటు

- సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం
- ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష
- ప్రజలు సంయమనంతో ఉండాలని సూచన

తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, కేవలం కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ , ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

:కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. అయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అవసరంగ లేకున్నా ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని ఉత్తమ్ సూచించారు. కావాలని గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్పీజీ ఆయిల్ సర్ఫరా సంస్థలతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్..' ప్రస్తుత పరిస్థితులపై నిన్న అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాం. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్టిబ్యూటర్ లు ఉన్నారు. 1.3 కోట్ల డోమాస్టిక్ కన్జుమర్స్ ఉన్నారు. 7.5 లక్షల కమర్షియల్ కన్జుమర్స్ ఉన్నారు. నెలకు యావరేజ్ 60 లక్షల సిలిండర్లు డొమెస్టిక్ వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలోనే కొరత ఏర్పడుతోంది. డొమస్టిక్ కన్జుమర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదు. ఆందోళనతో ముందస్తుగా అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారు. గృహ అవసర సిలిండర్లకు కొరత లేదు. కమర్షియల్ సిలిండర్లను కేంద్రం 20 శాతం సప్లై చేస్తోందన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రానికి లేఖ రాశాం. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమాస్టిక్ సిలిండర్లు సప్లై చేస్తారు. నిన్న మొన్న 2.3 లక్షలు సప్లై చేశారు. కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23 వేలు సప్లై చేసే వాళ్లు. కానీ ప్రస్తుతం 6200 సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు.


మిగతా 2 లో




# మూడు నెలల్లో సంక్షేమ భవనాలు


- వచ్చే విద్యాసంవత్సరం నాటికి కొత్త వసతి గృహాలు సిద్ధం
- పెరిగిన డైట్, కాస్మోటిక్ చార్జీల చెల్లింపునకు ప్రాధాన్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం


2


# మొజ్తబా ఆచూకీ చెబితే.. 10మిలియన్ డాలర్లు

## రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది.




# ఖర్గ్ ఐలాండ్‌పై దాడి


వివరాలు 4వ పేజీలో




## అమెరికాకు ఇరాన్ వార్నింగ్

ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యం గా.. ఖర్గ్ ఐలాండ్‌పై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఆ ద్వీపంలోని సైనిక స్థావరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. తాజాగా ఈ దాడులను ఇరాన్ కూడా ధ్రువీకరించింది. అయితే, చమురు మౌలిక సదుపాయాలకు ఎలాంటి హాని కలగలేదని వెల్లడించింది.



# బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు నా ప్రయాణం

రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే గొప్ప మార్పు

మంత్రి సీతక్క

ఢిల్లీలో జరిగిన షీ స్పార్క్ వేదికపై ఆదివాసీ బిడ్డ గళం

బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు తన జీవితం ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశాల ఫలితమని మంత్రి సీతక్క అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన అవకాశాల వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన షీ స్పార్క్ 2026 కార్యక్రమంలో సీతక్క ప్రసంగించారు.

# వేసవి విపత్తుపై సమరశంఖం

- 'అవేర్ ద్వారా ముందుగానే వేసవి తీవ్రతపై అప్రమత్తం
- జిల్లా అధికారులు, వైద్యులకు శిక్షణ కార్యక్రమాలు
- ఉప ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్సీల స్థాయి నుంచి సన్నద్ధత
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి

## 'సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026' సిద్ధం!



రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 'సమ్మర్ యాక్షన్ ప్లాన్-2026' అమలుపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు వేసవి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం, వడదెబ్బ లక్షణాలను గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి



- గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయం
- గిరిజనులతో మాటామంతి'లో జనసేనాని

# ఆయిల్ పామ్‌కు ఉజ్వల భవిష్యత్తు


- 22న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నర్సరీ ఫ్యాక్టరీ ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



# ప్రేమ పేరుతో ఎయిడ్స్ రోగి వికృత చేష్టలు

- పెళ్లికి నిరాకరించిన యువతికి ఎయిడ్స్ ఇంజెక్షన్
- ఫిర్యాదుతో రంగంలోకి దిగి అరెస్ట్ చేసిన పోలీసులు


02

# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

మొదటి పేజీ తరువాయి

స్కూల్స్, కాలేజెస్, సెంటర్, స్టేట్ గవర్నమెంట్ సంస్థలకు కమర్షియల్ సిలిండర్లు విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. సివిల్ సప్లై భవన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని. ఎవరైన కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా..బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ప్ లైన్ 180042500344 కు కాల్ చేయొచ్చని' మంత్రి ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, అక్రమ నిల్వలను అరికట్టేందుకు రాష్ట్ర , జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. గృహ అవసరాల సిలిండర్లు పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని



ఆయన హెచ్చరించారు. మొత్తానికి, సామాన్యుడి వంటింట్లో మంట ఆరిపోకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.

# మూడు నెలల్లో సంక్షేమ భవనాలు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం

### వచ్చే విద్యాసంవత్సరం నాటికి కొత్త వసతి గృహాలు సిద్ధం

### పెరిగిన డైట్, కాస్మోటిక్ చార్జీల చెల్లింపునకు ప్రాధాన్యం



**హైదరాబాద్, మార్చి 14:** రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాల కోసం నిర్మిస్తున్న భవనాల్లో 80 శాతం పనులు పూర్తయిన వాటిని యుద్ధ ప్రాతిపదికన రాబోయే మూడు నెలల్లో పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఈ భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సంక్షేమ శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, వసతి గృహాల మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా ఆర్థిక శాఖకు వచ్చేలా పర్యవేక్షించేందుకు ఒక సీనియర్ అధికారిని నియమించాలని సూచించారు. "ఈ వేసవి సెలవుల్లోనే హాస్టళ్ల మరమ్మత్తు పనులన్నీ పూర్తి కావాలి. ఇందులో అధికారుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోము" అని ఆయన హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో ఏడు నెలలకోసారి బిల్లులు చెల్లించేవారని, కానీ తమ ప్రభుత్వం హాస్టల్ అద్దెలు, ఎలక్ట్రికల్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు మరియు అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను ప్రతి నెలా చెల్లించేలా చర్యలు తీసుకుంటోందని భట్టి వివరించారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ఇప్పటికే డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచామని, వీటికి సంబంధించిన బిల్లులకు ఆర్థిక శాఖ మొదటి ప్రాధాన్యత ఇస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. హాస్టళ్లకు సరఫరా అయ్యే వస్తువుల నాణ్యతను తనిఖీ చేసేందుకు ఒక నిర్దిష్ట యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బోధన, భోజనం మరియు వసతుల నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు తరచూ వసతి గృహాలను సందర్శించి, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

### బాటిళ్లలో వాటిని సరఫరా చేస్తే కఠిన చర్యలు

### తమిళనాడు ఘటనలో డీలర్‌షి రద్దు చేసిన కేంద్రం

### ఇంధన సరఫరాలపై పెట్రోలియం శాఖ కీలక ఆదేశాలు జారీ



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్రం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందు జాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్ ను.. సీసాలు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీ చేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని భరోసా ఇచ్చింది. కంగారు పడి కొనుగోళ్లకు దిగవద్దని ప్రజలకు సూచించింది. సాధారణ కంటెయినర్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించింది. ఇక గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌ల విషయంలో నెలకొన్న భయాందోళనలపై ఇటీవల మార్కెటింగ్ ఆయిల్ రిఫైనరీ విభాగం జాయింట్ సెక్రెటరీ కూడా స్పందించారు. ఎల్‌పీజీ డెలివరీల్లో ఎలాంటి ఆటంకాలు లేవని అన్నారు. గ్యాస్ ఉత్పత్తిని భారతీయ రిఫైనరీలు 30 శాతం మేర పెంచాయని అన్నారు. గృహ వినియోగదారులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ జాగ్రత్త తీసుకున్నట్టు తెలిపారు. ఇక కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించిన వ్యవహారాల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేసింది. కీలక రంగాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా జరిగేలా మార్గదర్శకాల రూపకల్పన, అమలు బాధ్యతలను రాష్ట్రాలకు బదిలీ చేసింది.



## ప్రేమ పేరుతో మోసం

### ఎమ్మెల్యే పీఏ అరెస్ట్

**జయశంకర్ భూపాల పల్లి, మార్చి 14:** భూపాలపల్లి ఎమ్మెల్యే పీఏ శ్రీనివాస్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఓ దళిత యువతిని ప్రేమపేరుతో మోసం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎమ్మెల్యే కు పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్.. హనుమకొండలో పరిచయమైన చిట్యాల మండలానికి చెందిన ఓ దళిత అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. చాలాకాలంగా ప్రేమించుకోవడంతో పాటు పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అంతలోనే ఓ పోలీస్ కుటుంబానికి చెందిన అమ్మాయితో పెండ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధిత అమ్మాయి కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌పై చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్ద మనుషుల పంచాయితీలో సైతం శ్రీనివాస్ అమ్మాయితో పెండ్లికి నిరాకరించాడు. దీంతో అతడిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు అమ్మాయిని మోసం చేసిన కేసులో రిమాండ్‌కు పంపినట్టు చిట్యాల సీఐ మల్లేశ్ యాదవ్ తెలిపారు.

# పదో తరగతి పరీక్షలు ప్రారంభం

### దుఃఖాన్ని దిగమింగి పరీక్ష రాసిన విద్యార్థులు

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 2,676 కేంద్రాల్లో మొత్తం 5,28,239 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఈ పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్నాయి. అధికారులు అరగంట ముందుగానే విద్యార్థులను లోపలికి అనుమతించగా, ఐదు నిమిషాల గ్రేస్ టైమ్‌ను కూడా అమలు చేశారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 144 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించినట్లు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు.

### పుట్టెడు దుఃఖంలో పరీక్ష...


మరోవైపు రాష్ట్రంలోని పలు చోట్ల హృదయ విదారక ఘటనలు చోటుచేసుకున్నాయి. తండ్రి మరణించిన పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు హాజరై అందరినీ కంటతడి పెట్టించారు. మెదక్ జిల్లా పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఇంట్లో తండ్రి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగానే ఆయన కుమారుడు ధనుశ్ పట్టుదలతో పరీక్షా కేంద్రానికి వచ్చాడు. అలాగే యాదాద్రి జిల్లా మోత్కూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎల్లయ్య గుండెపోటుతో మరణించగా, ఆయన కుమారుడు హర్షవర్ధన్ శోకసంద్రంలో ఉండి కూడా పరీక్ష రాసి, మధ్యాహ్నం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని తలకొరివి పెట్టాడు.

### ఒకే ఒక్కడు..

ఇక నాగర్‌కర్నూలు జిల్లాలో అధికారులను విస్తుపోయేలా చేసిన ఒక విచిత్ర సంఘటన జరిగింది. బ్రిడ్జి కోర్సు పరీక్ష కోసం వరుణ్ సందేశ్ అనే విద్యార్థి ఒక్కడే దరఖాస్తు చేసుకోవడంతో, అధికారులు నిబంధనల




ప్రకారం జిల్లాలో ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఒక్క విద్యార్థి కోసం ఒక ఇన్విజిలేటర్, సూపరింటెండెంట్, ప్రత్యేక పోలీస్ బందోబస్తును కూడా కేటాయించారు. అయితే తీరా పరీక్ష సమయానికి సదరు విద్యార్థి గైర్హాజరు కావడంతో అధికారుల శ్రమ, ఏర్పాట్లు అన్నీ వృథా అయ్యాయి. మొత్తం మీద తొలిరోజు పదో తరగతి పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా మ-ంగిశాయి.




# ప్రేమ పేరుతో ఎయిడ్స్ రోగి వికృత చేష్టలు

### పెళ్లికి నిరాకరించిన యువతికి ఎయిడ్స్ ఇంజెక్షన్

### ఫిర్యాదుతో రంగంలోకి దిగి అరెస్ట్ చేసిన పోలీసులు

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం ప్రాంతంలో సమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. తనను పెళ్లి చేసుకోవడం లేదనే కోపంతో ఓ యువకుడు, యువతికి ప్రాణాంతకమైన ఎయిడ్స్ సోకిన రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఎక్కించాడు. సినిమా తరహాలో జరిగిన ఈ పైశాచిక ఘటన ఇప్పుడు కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు మనోహర్, బాధితురాలిని కొంతకాలంగా పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. మనోహర్‌కు ఎయిడ్స్ పాజిటివ్ ఉందని తెలియడంతో ఆ యువతి అతడితో పెళ్లికి నిరాకరించింది. తన ప్రాణాలను పణంగాపెట్టి పెళ్లి చేసుకోలేనని స్పష్టం చేసింది. తన వ్యాధి గురించి తెలిసి పెళ్లికి నో చెప్పిందనే కోపంతో మనోహర్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. 'నేను ఎలాగూ చనిపోతాను.. నువ్వు కూడా నాతోనే రావాలి' అనే వికృత ఆలోచనతో, తన రక్తాన్ని లేదా ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల రక్తాన్ని ఇంజక్షన్ ద్వారా ఆ యువతి శరీరంలోకి ఎక్కించాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఘట్‌కేసర్ పోలీసులు వెంటనే స్పందించారు. మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ రక్తాన్ని అతను ఎక్కడి నుంచి సేకరించాడు? దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. బాధితురాలిని వెంటనే ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రేమ పేరుతో ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై కఠిన చట్టాలు ప్రయోగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. బాధితురాలు త్వరగా కోలుకోవాలని స్థానికులు ఆకాంక్షించారు.

# 17న రవాణాశాఖ మొబిలిటీ సమ్మిట్

**ప్రజానావ, హైదరాబాద్:** రవాణా రంగం అభివృద్ధి, విద్యుత్ వాహనాలు తదితర అంశాలపై చర్చించేందుకు హైదరాబాద్ కేంద్రంగా నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి రవాణా శాఖ కమిషనర్, ఇతర కీలక అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 17న హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్‌లో 2వ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో రవాణా రంగం, స్మార్ట్ మొబిలిటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, నగర రవాణా అభివృద్ధి వంటి అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఎలేట్స్ టెక్నోమీడియా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ రవాణా శాఖ ముఖ్య భాగస్వామిగా ఉందని పేర్కొన్నారు.

# పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్‌కు స్వేచ్ఛ

### నిర్బంధాన్ని రద్దు చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు

**న్యూఢిల్లీ:** పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిర్బంధాన్ని రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. దాదాపు ఆరు నెలల తర్వాత ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. లద్దాఖ్ కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ గతేడాది లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే ఈ ఆందోళనలు జరిగాయని కేంద్రం వెల్లడించింది. ఈ క్రమంలోనే జాతీయ భద్రత చట్టం కింద అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. శాంతి భద్రతలను కాపాడాలనే ఉద్దేశంతో కస్టడీలోకి తీసుకున్నట్లు హోంశాఖ ప్రకటనలో వెల్లడించింది. లద్దాఖ్‌లో శాంతికి కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలో వాంగ్‌చుక్ నిర్బంధాన్ని తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొంది. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న బంద్‌లు, నిరసనల వాతావరణం శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాయని అభిప్రాయపడింది.

# టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యం

### డిజిటల్ ఎకానమీకి సాంకేతిక సహకారం

### మంత్రి శ్రీధర్ బాబుతో టాంజానియా బృందం భేటీ



టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజిటల్ ఎకానమీగా మారాలన్న టాంజానియా లక్ష్యానికి సాంకేతిక సహకారం అందించడానికి తెలంగాణ ముందుకు వచ్చింది. టాంజానియా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు. డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై సహకారం పెంచాలని ఇరు పక్షాలు అంగీకరించాయి. టాంజానియాలో ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటు చేసే అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. తెలంగాణ 'మీ సేవ' మోడల్ ద్వారా పౌర సేవల డెలివరీ విధానంపై మార్గదర్శకత్వం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'వీ హబ్' ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కల్పించే అంశంపై చర్చించారు. స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్ - స్కిల్లింగ్ రంగాల్లో కూడా సహకారం అందించాలని సమావేశంలో నిర్ణయించారు. 'త్వరలో తెలంగాణతో ఎంవోయూ కుదుర్చుకుంటాం. ఈ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది' అని టాంజానియా మంత్రి ప్రకటించారు.

# వేములవాడలో ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..



**వేములవాడ/ ప్రజా దివాస్ మార్చి 14**
జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల మరియు వేములవాడ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై రాజన్న ఆలయ అనుబంధ దేవాలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పట్టణంలోని మహంకాళి చౌరస్తా వద్ద జెండా ఆవిష్కరించి,కేక్ కట్ చేసి ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో నడుస్తూ రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో జనసేన జెండా ఎగురవేసే దిశగా పని చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా కోఆర్డినేటర్ పెంటల మహేష్,వేములవాడ నియోజకవర్గ నాయకులు నేరెళ్ళ నరేష్ గౌడ్,కొలగాని చందు,పవన్, చింతపంటి సాయికృష్ణ,ఎడెల్లి హర్షక్,మెడిశెట్టి రోహిత్,శ్రవణ్,సాయి కిరణ్,దుమాల మనోజ్,షాదుల్ల,కామని ప్రశాంత్,పవన్ కళ్యాణ్ అభిమానులు,పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిజాయితీకి నిదర్శనం: భీమేశ్వరాలయ సానిటేషన్ కార్మికురాలు నాగమణికి ఘన సత్కారం

**వేములవాడ ప్రజాదివాస్ మార్చి 14**
నేటి స్వార్థపూరిత సమాజంలో ఇంకా నిజాయితీ బతికే ఉందని వేములవాడ రాజన్న క్షేత్రం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థాన సానిటేషన్ కార్మికురాలు డబ్బు నాగమణి నిరూపించారు. ఆలయంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న సమయంలో తనకు దొరికిన సుమారు 4 తులాల బంగారు బ్రాస్లెట్‌ను అధికారులకు అప్పగించి తన గొప్ప మనసును చాటుకున్నారు. వరంగల్ జిల్లా లింగాల ఘనపురం మండలం కుందారం గ్రామానికి చెందిన భక్తుడు రేసు సతీష్ ఇటీవల స్వామివారి దర్శనార్థం ఆలయానికి రాగా, సుమారు 8 లక్షల రూపాయల విలువైన తన బంగారు బ్రాస్లెట్‌ను ఆలయ ప్రాంగణంలో పోగొట్టుకున్నారు. అది దొరికిన వెంటనే నాగమణి ఆలయ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు సదరు భక్తుడిని సంప్రదించి బ్రాస్లెట్‌ను సురక్షితంగా అతనికి అందజేశారు.నాగమణి ప్రదర్శించిన ఈ నిజాయితీని గుర్తిస్తూ ఆలయ ఈఓ రమాదేవి ఆమెను శనివారం ఘనంగా సత్కరించారు. ఆలయం తరఫున ఒక చీరను అందజేయడంతో పాటు, ఈఓ వ్యక్తిగతంగా మరో చీరను కూడా బహుకరించి అభినందించారు. గత కొన్ని సంవత్సరాలుగా నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న నాగమణి వంటి సిబ్బంది ఆలయానికి గర్వకారణమని ఈఓ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# 132 కెవి చిప్పలపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్లో సామర్థ్యం పెంపు విద్యుత్ అంతరాయం

**ముస్తాబాద్/మార్చ్ 13 ప్రజా దివాస్** ముస్తాబాద్ మండలంలోని చిప్పలపల్లి గ్రామంలో ఉన్న 132/33 కె.వి సబ్ స్టేషన్ లో ఉన్న 16 ఎఘు పవర్ ట్రాన్స్ఫార్మర్ స్థానంలో 31. 5 కెపాసిటీ గల పెద్ద పవర్ ట్రాన్స్ఫార్మర్ను పెడుతున్నట్లు డివిజనల్ ఇంజనీర్, సెస్ ఎన్ అంజయ్య తెలిపారు. ఈ సామర్థ్యం పెంపుకై చాలా కాలం గా ప్రయత్నాలు చేస్తున్నామని ఇప్పుడు నెరవేరుతుందని తెలిపారు. ఈ ట్రాన్స్ఫార్మర్ మార్పిడి చేసే పనులు శనివారం సాయంత్రం నుండి మొదలు,ఆదివారం మరియు సోమవారం సాయంత్రం లోగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ముస్తాబాద్, తెరమద్ది పోతుగల్ ,గన్నెవానిపల్లి మరియు గంభీరావు పేట మండలంలోని లింగన్నపేట, నర్మాల, కొత్తపల్లి, గంభీరావుపేట సబ్స్టేషన్లో పరిధిలోగల గ్రామాలకు విద్యుత్తు సరఫరా లో అంతరాయం జరిగితే ఆయా గ్రామాల లోని ప్రజలు, రైతులు,గృహ వినియోగదారు లు, వాణిజ్యం,పరిశ్రమలు మరియు ఇతర వినియోగదారులందరూ సహకరించాలని కోరుతున్నాం

## రుద్రంగి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సెస్ డైరెక్టర్ తండ్రిని పరామర్శించిన చల్మెడ



**రుద్రంగి మండలం/ ప్రజాదివాస్ మార్చి 14.**
రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం తండ్రి ఇటీవల అనారోగ్యానికి గురికాగా, ప్రస్తుతం వారు కరీంనగర్‌లోని చల్మెడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శనివారం ఆసుపత్రిని సందర్శించారు. అనారోగ్యంతో ఉన్న గంగారం తండ్రిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు సూచించడమే కాకుండా, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో పలువురు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ

**రాజన్న సిరిసిల్ల, మార్చి -14 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని కుసుమరామయ్య ఉన్నత పాఠశాల, నెహ్రూ నగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశార



# ఆశా కార్యకర్తల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి

### వేములవాడ ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం అందజేత



**వేములవాడ / ప్రజాదివాస్ మార్చి 14** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తలకు నెలకు రూ. 18,000 ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శనివారం వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (గ్రాఎజ) పరిధిలోని ఆశా కార్యకర్తలు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేసి తమ గోడును వెళ్లబోసుకున్నా రు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చించి, తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా రూ. 18 వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన రెమ్యూనరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## డ్రోన్ తాకిడికి తేనెటీగల దాడి: బండి సంజయ్ పాదయాత్రలో పలువురికి గాయాలు



**రామడుగు మండలం/ ప్రజాదివాస్ మార్చి 14** కేంద్ర మంత్రి బండి సంజయ్ చేపట్టిన పాదయాత్రలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. రామడుగు మండలం కోన్‌రావుపేట సమీపంలో పాదయాత్ర సాగుతుండగా, కార్యకర్తలను ఫోటో తీసేందుకు ఎగురవేసిన డ్రోన్ కెమెరా సమీపంలోని ఓ చెట్టుపై ఉన్న తేనెటీగల తుట్టెను తాకింది. దీంతో ఒక్కసారిగా తేనెటీగలు రేగి పాదయాత్రలో ఉన్న బిజెపి కార్యకర్తలపై దాడి చేశాయి. ఈ ఘటనతో ర్యాలీలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. తేనెటీగల దాడిలో పలువురు కార్యకర్తలు గాయపడగా, అప్రమత్తమైన బండి సంజయ్ వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆయనకు కూడా వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఇప్పటివరకు 17 కిలోమీటర్ల మేర పాదయాత్ర పూర్తి చేసుకున్న కేంద్ర మంత్రి, గంగాధర మండల కేంద్రానికి చేరుకొని మధ్యాహ్న భోజన విరామం తీసుకున్నారు. అనంతరం తిరిగి యాత్రను ప్రారంభించి సాయంత్రం 6.30 గంటల కల్లా కొండగట్టుకు చేరుకునేలా షెడ్యూల్‌ను ఖరారు చేసుకున్నారు.

## భీమేశ్వరుడిని దర్శించుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి






**వేములవాడ/ ప్రజాదివాస్ మార్చి 14** రాజన్న క్షేత్రంలోని అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు స్వస్తి వచనాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి, గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రమాదేవి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది మరియు స్థానిక నాయకులు

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**ధర్మారం, మార్చి 14 (వెలుగు నిఘా):** ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్య అధికారి డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 9వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, కావున రైతులు పశువులకు టీకాలను తప్పకుండా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర రజిత వెంకటేశం, ఉప సర్పంచ్ బైరి సురేష్ , వార్డు సభ్యులు ఎనగంధుల చంద్రమౌగిలి, తాళ్ళ రాజయ్య, పశువైద్య సిబ్బంది ఎండీ ఇబ్రహీం షరీఫ్, పి.రాజేందర్ , జి.రామ్ కిరణ్, ఎండీ అహ్మద్ పాషా, గోపాలమిత్ర వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నర్సరీ మొక్కల సంరక్షణ కార్యక్రమం




**ఖమ్మం ప్రతినిధి మార్చి 14 ( వెలుగు నిఘా )** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కూసుమంచి మండలం అగ్రహారం గ్రామంలోని నర్సరీ వద్ద ఉన్న సుమారు మొక్కలకు సరిపడా నీరు అందేలా చర్యలు తీసుకున్నారు. అలాగే మొలకలు రాని చోట్ల మళ్లీ విత్తనాలు వేయడం జరిగింది. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లెల స్వాతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గోడే కోటేశ్వరమ్మా, తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు



**మార్చి 14 భద్రాద్రి కొత్తగూడెం (వెలుగు నిఘా):** శనివారం నుండి జరుగబోయే 10 వ తరగతి పరీక్షలు రాస్తున్న పినపాక నియోజక వర్గ విద్యార్థినీ, విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గురజాల గోపి ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు భయం వద్దు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి. క్రమశిక్షణతో చదివి, పట్టుదలతో రాణించి మీ లక్ష్యాలను చేరుకోవాలిపరీక్షల్లో మంచి మార్కులతో విజయం సాధించి, మీ తల్లిదండ్రులకు, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాము.మీ కష్టానికి తగిన ప్రతిఫలం లభించాలని, మీరు అద్భుతమైన మార్కులతో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోగలరు.10వ తరగతి విద్యార్థినీ,విద్యార్థులకు ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు ఆల్ ది బెస్ట్ అని తెలిపారు.

# మఠంపల్లి లో ఉచిత వైద్య శిబిరం మార్చి 16 కు వాయిదా

**హుజూర్ నగర్: మార్చి 14 (వెలుగు నిఘా)** సూర్యా పేట జిల్లా మఠంపల్లి మండలం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆదివారం మార్చి 15న నిర్వహించాల్సిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ సోమవారం మార్చి 16 న ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు శని వారం మఠంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కళ్యాణి తెలియజేశారు..

# రాబోయే ఎన్నికల్లో సనాతన హైందవ ధర్మ రక్షణ ఎజెండాతో ముందుకు సాగుతాం.

**-ప్రజా సమస్యలు, అవినీతి, అక్రమాల పై పోరాటమే జనసేన లక్ష్యం.**

**- జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో బేతి మహేందర్ రెడ్డి పిలుపు.**



**కరీంనగర్, మార్చి 14(వెలుగు నిఘా )** తెలంగాణ ప్రజల గుండెల్లో నమ్మకాన్ని, యువతలో పోరాట స్ఫూర్తిని నింపి సమాజ మార్పుతో రాబోయే జమిలీ ఎన్నికల్లో సనాతన హైందవ ధర్మ రక్షణయే ఎజెండాగా ముందుకు సాగుతామని జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు. నగరంలోని వావిలాలపల్లి గుండ్ల హనుమాన్ దేవాలయం దగ్గర జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ 2014 సంవత్సరంలో మార్చ్ 14వ తేదీన పార్టీని పవన్ కళ్యాణ్ స్థాపించడం జరిగిందని, ఎన్ని అవమానాలు, ఇబ్బందులు, సమస్యలు ఎదురైనా మొక్కవోని దీక్షతో పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు సాగుతూ నేడు జనసేన పార్టీ అంటే ప్రజల్లో ఒక నమ్మకం, విశ్వాసం పెరిగిందని, దానికి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎంతో కష్టపడ్డారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ గారికి అత్యంత సన్నిహితులుగా, దేశం హితం కోసం, సనాతన హైందవ ధర్మ రక్షణ కోసం పార్టీ ఎజెండాగా తీసుకొని రాబోయే జమిలీ ఎన్నికలకు పార్టీని ప్రతి గడప గడపకు తీసుకెళ్లాలని పవన్ కళ్యాణ్ గారు పిలుపునివ్వడం జరిగిందని, దానిలో భాగంగా పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ సభ్యత్వాన్ని పవన్ కళ్యాణ్ అభిమానులు, జాతీయవాదులు, హిందూత్వవాదులందరు పార్టీ సభ్యత్వాన్ని తీసుకొని జనసేన పార్టీకి అండగా ఉండాలని బేతి మహేందర్ రెడ్డి కోరారు. మరి ముఖ్యంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల పై పోరాటం చేస్తూ, అవినీతి అక్రమాల పై ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని పవన్ కళ్యాణ్ జన సైనికులకు సూచించారని, దానిలో భాగంగా కరీంనగర్ లో అభివృద్ధి మాటున జరిగిన, జరుగుతున్న అనేక అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామని బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు.
ఈ ఆవిర్భావం దినోత్సవ కార్యక్రమంలో జనసేన నాయకులు కాసర్ల మధుకర్ రెడ్డి, వొద్నల రాజు, సాధు మధుసూదన్ రెడ్డి, వావిలాల రోహిత్ రెడ్డి, టీ. రవీందర్ రెడ్డి, బేతి సురేందర్, బేతి రాజశేఖర్ రెడ్డి, నలుమాచు శ్రీనివాస్ రెడ్డి, చందు, వావిలాల రామ్ రెడ్డి, సురేష్ రెడ్డి, శ్రీపాల్, ఉమ్మెంతుల మదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చందుర్తి ప్రాజెక్టును పరిశీలించిన ప్రభుత్వ విప్- మల్యాల పంప్ హౌస్ వద్ద అధికారులకు కీలక ఆదేశాలు



**చందుర్తి మండలం/ ప్రజా దివాస్ మార్చి 14** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని చందుర్తి మండలంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం విస్తృతంగా పర్యటించారు. నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి రామన్నపేట గ్రామంలోని డి4 కెనాల్, చందుర్తి ప్రాజెక్టును సందర్శించిన ఆయన, మల్యాల గ్రామంలోని పంప్ హౌస్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రామన్నపేట గ్రామంలోని డి4 కాలువ అధ్వానంగా మారి నీటి సరఫరాకు ఆటంకం కలుగుతోందని గుర్తించిన విప్ ఆది శ్రీనివాస్, తక్షణమే స్పందించి కాలువ మరమ్మత్తుల కోసం రూ. 21 లక్షల నిధులను మంజూరు చేయించారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు పూర్తి చేసి, చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మల్యాల పంప్ హౌస్ వద్ద అధికారులతో మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా తాగునీరు మరియు సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# "హన్మాజీపేటలో ఎంపీడీఓ శ్రీనివాస్ పర్యటన: అభివృద్ధి పనుల తనిఖీ"

**-"అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం: సర్పంచ్ జంకె మధు"**

**వేములవాడ ప్రజా దివాస్ మార్చి 14 (అనిల్ కుమార్ గ్యారే)** వేములవాడ గ్రామీణ మండలంలోని హనుమాజీపేట గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శ్రీనివాస్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక సర్పంచ్ జంకె మధుతో కలిసి గ్రామంలోని నర్సరీ మరియు ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, నర్సరీలో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రాబోయే వర్షాకాలం నాటికి నాటడానికి సిద్ధంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.అనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు మరియు అధికారులకు సూచించారు. సర్పంచ్ జంకె మధు మాట్లాడుతూ, గ్రామంలోని అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, గ్రామ రెవెన్యూ సిబ్బంది మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

